సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 16 । మార్చి । 2023



పేట్రేగిన పిచ్చికుక్కలు

రాజంపేట, చిట్వేలిలో పిచ్చికుక్కలు పేట్రేగాయి. వీటి దాడిలో రాజంపేటలో ఇద్దరు, చిట్వేలిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. -8లో..



దొంగలకు దారి చూపిందెవరో?

స్టాఫ్ నర్సుల నియామకంలో మార్కుల మాయాజాలం కథనంపై రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరి స్పందించారు. -8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37.0/22.9

వాతావరణం

జిల్లాలో బుధవారం 22.9 - 37.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

ప్రాజెక్టుల పరుగులు

- టీజీపీ సీఈ పరిధిలో రూ.4825 కోట్లు పనులు పూర్తి
- జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ 3వ ప్యాకేజీ పూర్తికి సంసిద్ధం
- డిసెంబర్ నాటికి 50 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు సన్నాహాలు
- రూ.212 కోట్లతో డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ఏర్పాటు
- జీఎన్ఎస్ఎస్ టు హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్‌కు ప్రత్యేక ప్రాధాన్యత
- రాయలసీమ కరువు నివారణకు ప్రత్యేక ప్రణాళిక



కాలేటివాగు రిజర్వాయర్ బండ్ నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, కడప: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు పరుగులు పెడుతున్నాయి. టీజీపీ సీఈ పరిధిలో (తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్) రెండేళ్లలో రూ.4,825 కోట్ల పనులు జిల్లాలో చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ రాయలసీమ కరువు నివారణ కోసం ప్రత్యేక ప్రణాళికలు రచించింది. మరోవైపు ఆయకట్టు స్థిరీకరణపై దృష్టి సారించింది. వెరశి డిసెంబర్ నాటికి జిల్లాలో 50వేల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ఉంది. అందుకు తగ్గట్లుగా అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందించారు.

- రాయలసీమలో సాగు, తాగునీటి కోసం గాలేరి-నగరి సుజల స్రవంతి పథకం (జీఎన్ఎస్ఎస్) నుంచి హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకాన్ని (హెచ్ఎన్ఎస్ఎస్) అనుసంధానం చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రచించారు. రాయలసీమ డ్రాట్ మిటిగేషన్ ప్రాజెక్టు (ఆర్డీఎంపీ) ద్వారా జీఎన్ఎస్ఎస్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు లిఫ్ట్ స్కీమ్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ముదివేడు, పుంగనూరు నియోజకవర్గంలో నేతికుంటపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆమేరకు శరవేగంగా ఆయా ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి. గడిచిన రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి జిల్లాలో రూ.4825 కోట్ల పనులు పూర్తి చేశారు. జీఎన్ఎస్ఎస్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు అనుసంధానికి ప్రత్యేకంగా నిలుస్తున్న కాలేటివాగు రిజర్వాయర్ బండ్ పనులు దాదాపు పూర్తి అయ్యాయి. లిఫ్ట్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ పూర్తికి సన్నాహాలు

జీఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ నిర్మాణం పూర్తికి సన్నాహాలు చేపట్టారు. ప్యాకేజీ-1, 2, 3 పనులు జీఎన్ఎస్ఎస్ మెయిన్ కాలువ పరిధిలోకి రానున్నాయి. జిల్లాలో సున్నా నుంచి 119 కిలోమీటర్ల వరకూ ఈపనులు చేపట్టాల్సి ఉంది. 4వ ప్యాకేజీ నుంచి 7వ ప్యాకేజీ వరకూ ఫారెస్టు క్లియరెన్సు రావాల్సి ఉంది. ఓవైపు జిల్లాలో ప్రధాన కాలువ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతూనే జీఎన్ఎస్ఎస్ పరిధిలో ఉన్న ఆయకట్టు స్థిరీకరణకు అధికారులు పథక రచన చేశారు. జిల్లాలో 50 వేల ఎకరాలకు డిసెంబర్ నాటికి సాగు నీరు ఇవ్వాలనే దృఢ సంకల్పంతో ఉన్నారు. అందులో భాగంగా ప్యాకేజీ-1 కింద 10వేల ఎకరాలు, సర్వరాయసాగర్ ద్వారా 25 వేల ఎకరాలు, వామికొండ రిజర్వాయర్ కింద 15 వేల ఎకరాలు ఆయకట్టు స్థిరీకరణకు కసరత్తు చేపట్టారు. ఆమేరకు రూ.212 కోట్లతో డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు.

యర్రబల్లె లిఫ్ట్ స్కీమ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత...

యర్రబల్లె లిఫ్ట్ స్కీమ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి యర్రబల్లె లిఫ్ట్ స్కీమ్ ద్వారా పులివెందుల నియోజకవర్గంలో కొండ తీర ప్రాంత గ్రామాలకు తాగు, సాగునీరు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో రూపొందించారు. ఆమేరకు గిడ్డంగివారిపల్లె వద్ద 1.2 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. ఈ రిజర్వాయర్ ద్వారా 10వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించనున్నారు. పైగా యూసీఐఎల్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత నీరు అందించాలనే ప్రధాన లక్ష్యంతో చేపడుతున్నారు.

వరద నీరు సద్వినియోగం దిశగా....

పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వరద జలాల సద్వినియోగం దిశగా ఆర్డీఎంపీ రూపొందించారు. ప్రస్తుతం 20వేల క్యూసెక్కుల నీటి డ్రా చేసుకునే వెసులుబాటు మాత్రమే ఉంది. మరో 10వేల క్యూసెక్కులు అదనంగా వరద నీటిని డ్రా చేసుకునేందుకు అవుకు టన్నెల్, గండికోటలో సమాంతరంగా మరో టన్నెల్ రూపొందించనున్నారు. తద్వారా నీరు నిల్వ చేసుకుంటూనే సముద్రం పాలయ్యే నీటిని జీఎన్ఎస్ఎస్‌కు మళ్లించి హెచ్ఎన్ఎస్ఎస్‌కు లిఫ్ట్ చేయడం ద్వారా రాయలసీమ కరువు నివారించాలనే కృత నిశ్చయంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కార్ ఉందని నిపుణులు వివరిస్తున్నారు.



జీఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం కోసం చేపట్టిన లిఫ్ట్ పనులు

ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉంది. భూగర్భజలాల సంరక్షణకు ఎప్పటికప్పుడు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఆమేరకు ముందస్తుగా మైలవరం ప్రాజెక్టు నుంచి పెన్నాకు 500 క్యూసెక్కులు విడుదల చేశారు. తద్వారా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

- గండికోట ప్రాజెక్టులో ఇప్పటికే 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే వామికొండలో 2 టీఎంసీ, సర్వరాయసాగర్ 2.5 టీఎంసీ, సీబీఆర్‌లో 10 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీలు, మైలవరంలో 6.5 టీఎంసీ, పైడిపాళెం ప్రాజెక్టులో 6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అంతేకాకుండా ఎస్ఆర్-1, ఎస్ఆర్-2, ఎల్ఎస్పీ, యూఎస్పీ ప్రాజెక్టుల్లో సైతం నీరు నిల్వ ఉండడం విశేషం.

జిల్లా ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రాధాన్యత...



జిల్లాలోని జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ పనులు, సీబీఆర్ యర్రబల్లె లిఫ్ట్ స్కీమ్, జీఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం ప్రత్యేక ప్రాధాన్యతగా పెట్టుకున్నాం . ఆమేరకు ఆయా ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణం, లిఫ్ట్ స్కీమ్ పనులు శరవేగంగా చేపడుతున్నాం. ఇప్పటికే రూ.4,825 కోట్ల పనులు పూర్తి చేశాం. జిల్లాలో ప్రాజెక్టుల ప్రాధాన్యత పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. బడ్జెట్‌లో సైతం రాయలసీమ ప్రాజెక్టులకు ప్రాధాన్యత దక్కుతోంది. – హరినారాయణరెడ్డి, తెలుగు గంగ ప్రాజెక్టు సీఈ

న్యూస్‌రీల్

ఘనంగా టెక్‌ఫెస్ట్ 2కె23



టెక్ ఫెస్ట్ 2కె23 కార్యక్రమ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వీసీ రంగ జనార్ధన

పులివెందుల రూరల్: పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో బుధవారం టెక్ ఫెస్ట్ -2కె23 కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెఎన్‌టీయూ ఉప కులపతి ఆచార్య జి.రంగ జనార్ధన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సాంకేతిక రంగంలో విద్యార్థులు సృజనాత్మకత, పోటీతత్వంతో బాగా రాణించాలన్నారు. టెక్‌ఫెస్ట్ సందర్భంగా అన్ని విభాగాలలో వర్క్ షాపులు, టెక్నికల్ ఈవెంట్స్, స్పాట్ ఈవెంట్స్, పేపర్ ప్రజెంటేషన్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వీసీ రంగ జనార్ధన సీఎస్ఈ విభాగంలో ఐటీ కిట్, రక్తదాన యా ప్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వసుంధర, వైస్ ప్రిన్సిపల్ రమణారెడ్డి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు హాజరయ్యారు.

ఆన్‌లైన్‌లో ముగిసిన ఇన్‌స్పైర్ మనాక్



ఆన్‌లైన్‌లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జ్యూరీ సభ్యులు

కడప ఎడ్యుకేషన్: 2021-22 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో పాఠశాల నుంచి జిల్లాస్థాయికి 351 ప్రాజెక్టులు ఎంపికకాగా ఇందులో 302 మంది జిల్లాస్థాయి ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ 302 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో ఎంపిక చేసిన జూరీ మెంబర్ల సహాయంతో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ డిల్లీ వారి పర్యవేక్షణలో ఈ నెల 14,15 తేదీలలో పరిశీలన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన నలుగురు జూరీ మెంబర్లు ప్లస్ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి ఇద్దరు కలిసి మొత్తం ఆరుగురు పాల్గొన్నారు. 302 నుండి రాష్ట్రస్థాయికి ఎంపిక చేసిన వారి వివరాలను ఒకటి రెండు రోజుల్లో తెలియపరుస్తారు.

డాక్టర్ అచ్చెన్న అదృశ్యం

- కడప వన్‌టౌన్‌లో కేసు నమోదు



డాక్టర్ అచ్చన్న, డిప్యూటీ డైరెక్టర్

కడప అర్బన్: పశు సంవర్థక శాఖలో కడప వెటర్నరీ పాలీ క్లినిక్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అచ్చన్న ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించకుండా పోయారని అతని కుమారుడు, కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ క్లింటన్ చక్రవర్తి బుధవారం కడప వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప నగరంలోని కాగితాలపెంటలో నివాసం వుంటున్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చన్న ఈనెల 12న తన ఇంటినుంచి ఆఫీసుకు, ఆతర్వాత చర్చికి వెళ్లివస్తానని చెప్పి తరువాత ఇంటికి రాలేదని, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేగాక ఇటీవలి కాలంలో తమ తండ్రి పనిచేస్తున్న కార్యాలయంలో శాఖాపరమైన ఇబ్బందులు జరిగాయని తెలియజేశారు. తమ తండ్రి ఆచూకీ కనుగొనాలని ఆయన కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎన్.వి.నాగరాజు తెలియజేశారు.

వీపీసీ డీడీగా డీఏహెచ్‌ఓకు అదనపు బాధ్యత

కడప అగ్రికల్చర్: కడప వెటర్నరీ పాలిక్లీనిక్(వీపీసీ) డిప్యూటీ డైరెక్టర్‌గా జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి శారదమ్మకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఆమె బాధ్యతలను చేపట్టినట్లు తెలిసింది. వీపీసీలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అచ్చన్నను సస్పెండ్ చేస్తున్నట్లుగా ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాల్ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై శారదమ్మను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆమె స్పందించలేదు. అలాగే అచ్చన్నను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన మొబైల్ సిచ్ఛాఫ్‌లో ఉంది.

నూతన కార్యవర్గం

కడప కార్పొరేషన్: కడప హోటల్ , ఫుడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం ఎంపికైంది. జిల్లా అధ్యక్షుడిగా ఫుడ్ నేషన్ ఎండీ రషీద్ ఖాన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా షఫీ, చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

ఒంటిమిట్టలో పర్యటించిన జేసీ సాయికాంత్ వర్మ

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో ఏప్రిల్ 5న జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఒంటిమిట్టలో కల్యాణోత్సవ వేదిక, శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్‌తో కలిసి క్షేత్రస్థాయిలో జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీ నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయన్నారు. ముఖ్యంగా ఏప్రిల్ 5న జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చే అవకాశం ఉన్నందున ..పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు రావచ్చనే అంచనాతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందుకు గాను జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు జిల్లా అధికారులకు ప్రత్యేక విధులను కేటాయించారన్నారు. జిల్లా యంత్రాంగం , టీటీడీ తరపున అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. భక్తులకు మెరుగైన వసతులను కల్పించాలన్నారు. భద్రతా ఏర్పాట్లు, శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, తాగునీరు, అన్నప్రసాదాలు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ కంట్రోల్, ఆర్టీసీ రవాణా సౌకర్యం, సూచిక బోర్డులు ఏర్పాట్లు, కంట్రోల్ రూం ఏర్పాటు, సీసీ కెమెరాలు, విద్యుత్, అగ్నిమాపక వాహనాలు, 108 వాహనాలు, అత్యవసర మందులు, మెడికల్ క్యాంపులు, హెల్ప్ డెస్కుల ఏర్పాటు తదితర అంశాలపై మాట్లాడారు. పలు సూచనలు చేశారు. అనంతరం జేసీ సాయికాంత్ వర్మ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించి, స్వామిని దర్శించుకున్నారు.



బందోబస్తుపై డీఎస్పీతో మాట్లాడుతున్న జేసీ సాయికాంత్ వర్మ

- ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకటరమణ, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు యదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్, రామమోహన్ రెడ్డి, డీఎస్పీ శివారెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీటీసీ మీరాప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం ప్రసాద్‌రెడ్డి, సమాచార శాఖ ఏడీ వేణుగోపాల్ రెడ్డి, టీటీడీ సివిల్ విభాగం ఈఈ సుమతి, డీఈ రామమూర్తి, విద్యుత్ విభాగం డీఈ చంద్రశేఖర్, డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భారతీ సిమెంట్ యాజమాన్యం బారిగేట్ల వితరణ

బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ కోరిక మేరకు 25 బారిగేట్లను భారతీ సిమెంట్ యాజమాన్యం ఒంటిమిట్ట పోలీసు లకు వితరణ చేసింది. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో భారతీ సిమెంట్ వారు ఇచ్చిన బారిగేట్లను డీఎస్పీ వెంకట శివారెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో భారతీ సిమెంట్ యాజమాన్యం తరపున చీఫ్ మేనేజర్ అబ్బిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్, కడప మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, ఒంటిమిట్ట భారతీ సిమెంట్ డీలర్ పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



కడపలోని గాయత్రీ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు



ఓ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఆర్ఐవో రమణరాజు

- మొదటి రోజే ఇద్దరు విద్యార్థులు డిబార్
- 22,413 మంది విద్యార్థులకు 21,426 మంది హాజరు
- నిర్ణీత సమయానికే పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- పలు కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్ఐవో, స్క్వాడ్

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్‌కు సంబంధించి ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులంతా నిర్ణీత సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. హాల్‌టికెట్లను సిబ్బంది పరిశీలించి పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను ఏర్పాటు చేశారు.

తొలిరోజు ఇద్దరు విద్యార్థులు డిబార్

ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను అధికారులు డిబార్ చేశారు. ఇందులో పులివెందులలో ఒకరిని, రాయచోటిలో మరొకరిని డిబార్ చేశారు.

కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆర్ఐవో రమణరాజు పేర్కొన్నారు. విద్యార్థులంతా నిర్ణీత సమయానికే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆలస్యమైతే ఎవరినీ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించమని పేర్కొన్నారు.

నేడు ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

ఇంటర్మీడియెట్ పరీక్షల్లో భాగంగా గురువారం ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 92 పరీక్షా కేంద్రాలకు 24,696 మంది హాజరుకానున్నారు. ఈ పరీక్ష నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు.

ఉమ్మడి జిల్లాలో 987 మంది గైర్హాజరు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 92 పరీక్ష కేంద్రాలలో మొదటిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ ఒకేషనల్ సబ్జెకుల పరీక్షలకు 22,413 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 21,426 మంది హాజరయ్యారు. 96.6 శాతం హాజరు నమోదైంది. రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి పరిశీలకుడిగా హాజరైన రవిశంకర్‌నాయక్‌తో పాటు ఆర్ఐవో రమణరాజు, నలుగురు జిల్లా పరీక్ష కమిటీ సభ్యులు, నాలుగు ప్లెయింగ్ స్క్వాడ్‌లు కేంద్రాలను తనిఖీ చేశారు.

కౌంటింగ్‌కు వేళాయె

- నేటి ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న ప్రక్రియ
- పశ్చిమకు సంబంధించి అనంతపురంలో, తూర్పునకు సంబంధించి చిత్తూరులో ఓట్ల లెక్కింపు

సాక్షి కడప: శాసనమండలి ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ గురువారం జరగనుంది. అభ్యర్థులు ఇప్పటికే భవితవ్యం కోసం ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఈనెల 13వ తేదీ ముగిసిన నేపథ్యంలో గురువారం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ అనంతపురంలో జరగనుండగా, తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల కౌంటింగ్ కార్యక్రమం చిత్తూరులో జరగనుంది. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం 8.00 గంటల నుంచి బ్యాలెట్ పత్రాలను కట్టలు కట్టడం మొదలుకొని పోస్టల్ బ్యాలెట్ పత్రాల లెక్కింపు వరకు ప్రక్రియ కొనసాగనుంది. ఇప్పటికే పోటీలో ఉన్న అభ్యర్థులు లెక్కలు వేసుకుంటూ ఓట్ల లెక్కింపు కోసం ఎదురుచూస్తున్నారు. బుధవారం రాత్రే కౌంటింగ్‌కు సంబంధించి అవసరమైన ఏజెంట్లు కూడా ఆయా ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు. కౌంటింగ్‌లో భాగంగా తొలి మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కించడంతోపాటు అనంతరం రెండవ ప్రాధాన్యతను లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు.



అనంతపురం జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లు

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

మైదుకూరు : విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సదరన్ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ కె.రామమోహన్ రావు పేర్కొన్నారు. బుధవారం మైదుకూరు ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థపై వినియోగదారునికి నమ్మకం పెంచే విధంగా ప్రతి ఉద్యోగి పని చేయాలని తెలిపారు. ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు నాలుగు ఫిర్యాదు అందాయి. వీటిని రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ టెక్నికల్ సభ్యుడు ఎస్ఆర్ అంజనేయులు, మైదుకూరు ఈఈ జీవీ రామిరెడ్డి, ఈడీ ఈ.శ్రీనివాసులరెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

బంక్ ఏర్పాటు విషయంలో ఘర్షణ

– కర్రలు, రాళ్లతో దాడి : 10 మందికి తీవ్రగాయాలు



గాయపడిన వెంకటనారాయణ, శ్రీనాథ్

జమ్మలమడుగు రూరల్ : అంబవరం గ్రామంలోని జగనన్న కాలనీలో బంక్ ఏర్పాటు చేసుకోనే విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన జమ్మలమడుగు మండలంలో చోటు చేసుకొంది. పట్టణ సీఐ సదా శివయ్య కథనం మేరకు అంబవరం గ్రామానికి చెందిన పంజాగాళ్ల శ్రీనాథ్ వెంకటనారాయణ బంధువులు కలసి ముద్దనూర్ రహదారిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలో కొంత కాలం నుంచి బంక్ ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం సాయంత్రం లింగమయ్య వర్గానికి చెందిన మరి కొంతమంది కలసి మరోక బంక్ ఏర్పాటు చేసుకోనే క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణ కు దారితీసింది. పరస్పరం కర్రలు, రాళ్లతో దాడులు చేసుకోన్నారు. ఈ సంఘటనలో పంజాగాళ్ల శ్రీనాథ్, పంజాగాళ్ల వెంకటనారాయణకు తీవ్రగాయాలు కాగా రామయ్య శ్రీనివాసులు, రాజు, సాయిలకు స్వల్పగాయాలయ్యాయి. వీరంతా ఒక వర్గం కాగా మరో వర్గమైన లింగమయ్య, క్రిష్ణ, లక్ష్మీదేవికు స్వల్పం, అర్జున్‌కు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వీరంత బావ బామర్దులుగా సీఐ తెలిపారు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని దొరసానిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా బాల, బాలికల జట్లకు బాల్ బ్యాడ్మింటన్‌లో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టుకు ఎస్.ముస్తాక్, డి.కౌశిక్, మొహమ్మద్ బాబా (రాజంపేట), కె.శ్రీనివాసులు, ఎం.కిరణ్ కుమార్ నాయక్ (ఆర్‌సీపీఈ), డి.రఫెల్, జి.నరసింహుడు (చిన్నసింగనపల్లె), డి.సాయి శ్రీహర్షిత్ (సింహాద్రిపురం), ఎస్‌డీ ఆరిఫ్ (నరసాపురం), ఎస్.వెంకటరత్న (పెనగలూరు) ఎంపికయ్యారు. బాలికల జట్టుకు టి.గౌరిప్రియ, ఎం.షాలిని ప్రియ, ఎస్. ఇమామ్ ఫాతిమా, ఎస్.సోనియా, పి.రమ్య, ఎస్.శ్రావణి (రాజంపేట), వై.అరుణ, పి.మునియామిని, కె.వెకంట లహరి, కె.వెంకట పూజిత (దొరసానిపల్లె) ఎంపికయ్యారు. వీరు ఈనెల నెల్లూరు జిల్లా కావలిలో ఈనెల 17, 18, 19 తేదీలలో జరిగే 7వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.శంకర్‌రెడ్డి, సెక్రటరీ ఎస్.సుధాకరరావు, మునివర, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కొండారెడ్డి, పీడీ ప్రసాద్, మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు మేరీ సుప్రియ, ఉపాధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, సెక్రటరీ వెంకట రమణ పాల్గొన్నారు.



దొంగలకు దారి చూపిందెవరో?

- నకిలీ సర్టిఫికెట్ల కుంభకోణంలో సూత్రధారులపైఆరా
- మార్కుల మాయాజాలం కథనంపై కలకలం



వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్ : కడపలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 (రాయలసీమ) పరిధిలో చేపట్టిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సు నియామకాల ప్రక్రియకు సంబంధించి 'సాక్షి'లో ప్రచురితమైన 'మార్కుల మాయాజాలం' కథనం కలకలం రేపుతోంది. ఈ విషయమై రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరి స్పందించారు. బోగస్ సర్టిఫికెట్ల గురించి ఆరా తీస్తున్నామన్నారు. సమగ్ర దర్యాప్తు చేపట్టాం. నిబంధనల ప్రకారం కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.

కుంభకోణం ఏదైనా దాగి ఉందా?

స్టాఫ్ నర్సు నియామకాలకు సంబంధించి 291 మందికి ఉద్యోగావకాశం కల్పించాల్సి ఉండగా, అందులో 26 మంది కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదు. ఈ ఉద్యోగ నియామక ప్రక్రియకు సంబంధించి ఆ శాఖ అధికారులు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ శాఖలో పనిచేసే సిబ్బంది వేలాది మంది దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి ఉంటారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆ పత్రాలు నకిలీవా? లేదా ఒరిజినల్‌వా అనే అంశాన్ని పసిగట్టాలి. కాగా ఈ అంశానికి సంబంధించి పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరో ఫిర్యాదు చేస్తేనే 15 మంది బోగస్ అభ్యర్థులు బయటపడ్డారు. అందులో 8 మంది అభ్యర్థుల మార్కుల జాబితా బోగస్ అని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు నిర్ధారించారు. ఇంకా అడ్డదారుల్లో వచ్చి ఉద్యోగం చేస్తున్న వారు ఎంతమంది ఉంటారో తెలియాల్సి ఉంది. దీన్ని ఒక కుంభకోణంగానే పరిగణించవచ్చని ఆ శాఖ ఉద్యోగులు భావిస్తున్నారు. ఈ సర్టిఫికెట్లను వైద్య ఆరోగ్యశాఖకు చెందిన వారు తయారు చేస్తున్నారా? లేదా బయట వ్యక్తులు సృష్టిస్తున్నారా? అనేది సందేహాస్పదంగా మారింది.

గత చరిత్రంతా అవినీతి మయం

గతంలో ఈ శాఖలో బదిలీలు, పదోన్నతులు, ఉద్యోగ నియామకాలకు సంబంధించి పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. ఈ అవకతవకలపై 'సాక్షి' కథనాలను ప్రచురించింది. వీటిపై స్పందించి అప్పటి యంత్రాంగం ఆ శాఖలో పనిచేస్తున్న అవినీతి పరులైన ఉద్యోగులపై వేటు వేస్తూ వచ్చింది. తాజాగా ఆ శాఖలో స్టాఫ్ నర్సుల నియామకం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. స్టాఫ్ నర్సు నియామకాలకు సంబంధించి బోగస్ సర్టిఫికెట్లు సంపాదించిన వారంతా చిత్తూరు జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆ శాఖ పనితీరుపై అందికి కన్ను పడింది. గతంలో లాగా అవినీతి ఆరోపణలతో కూరుకుపోతుందా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. త్వరలో ఈ శాఖ పరిధిలో మరిన్ని ఉద్యోగ నియామకాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వాలన్న సంకల్పంతో ముందుకు వెళుతోంది. దీనిపై నిరుద్యోగులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే అందుకు అనుగుణంగా అధికారులు కూడా పనిచేయాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. బోగస్ మార్కుల జాబితాపై అధికారులు దృష్టి సారించి కఠినచర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఉద్యోగులు అంటున్నారు.

వైఎస్ వివేకాకు నివాళి



వైఎస్ వివేకా సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్ సునీత, తదితరులు

పులివెందుల : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి నాలుగో వర్ధంతి సందర్భంగా పులివెందులలోని బుధవారం ఆయన ఘాట్ వద్ద కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, బావమరిది శివప్రకాష్‌రెడ్డి, వివేకా సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డిలతో పాటు ఇతర కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

కమలాపురం : రేణిగుంట–గుంతకల్లు రైల్వే లైన్ పరిధిలోని కమలాపురం మండలం సి.గోపులాపురం వద్ద రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. రైల్వే సిబ్బంది సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్నామన్నారు. మృతుని జేబులో ఉన్న ఆధార్ కార్డును బట్టి చత్తీస్‌ఘడ్‌కు చెందిన మన్ రాజ్‌సింగ్ (39)గా గుర్తించామన్నారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

రూ. 7.16 లక్షల విలువైన 19 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితులతో కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి, పోలీసు అధికారులు

కడప అర్బన్ : పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి దక్షిణం దిక్కున సుమారు 7 కిలోమీటర్లు వున్న బావికోన కొండ సమీపంలో ఈనెల 14న ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ఆరుగురు స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు 362 కిలోల బరువున్న దాదాపు రూ.7.16 లక్షల విలువైన 19 ఎర్రచందనం దుంగలను,రెండు గొడ్డళ్లు, 4 స్టోన్స్,రెండు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా తమకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు కడప రూరల్ సీఐ కె. అశోక్‌రెడ్డి, పెండ్లిమర్రి ఎస్ఐ ఎన్. రాజరాజేశ్వర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి ఎర్రచందనం స్మగ్లర్లపై దాడులు చేశారన్నారు. పెండ్లిమర్రి మండలం బావికోన కొండ దగ్గర గల అల్లు గంగాధర్ పత్తి పొలం సమీపంలో ఆరుగురు వ్యక్తులు వారి భుజాల మీద ఎర్రచందనం దుంగలను కొండపై నుంచి మోసుకుని రావడం ఎస్ఐ గమనించారు. వెంటనే సిబ్బంది సాయంతో వారిని పట్టుకోవడానికి ప్రయత్నించారు. వారిలో కొందరు పోలీసులపై రాళ్లతో దాడికి ప్రయత్నించారు. పోలీసు లు దీటుగా ఎదుర్కొన్నారు. వారు మోసుకెళుతున్న 19 ఎర్రచందనం దుంగలు, గొడ్డళ్లు, రెండు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. అరెస్టయిన వారిలో పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామం చేలో వీధికి చెందిన అల్లు సుధాకర్, హరిజనవాడకు చెందిన కోటా శ్రీనివాసులు అలియాస్ నాసోడు, కూలిబక్కమ్మగారి గ్రామానికి చెందిన షేక్ హుసేన్ పీరా, హరిజనవాడకు చెందిన పబ్బత్తి ఓబులేసు, ఖాజీపేట మండలం పూసలకొట్ట గ్రామం మోటు శ్రీనివాసులు అలియాస్ శ్రీను, పత్తూరు గ్రామానికి చెందిన బాలినేని గంగయ్య అలియాస్ నాయుడులు ఉన్నారని కడప డీఎస్పీ తెలిపారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, ఏఎస్ ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుళ్లు సుధాక ర్, శ్రీహరి, కానిస్టేబుళ్లు కృష్ణ, సుభాన్, జయచంద్ర, అశోక్, విజయ్, చంద్రశేఖర్, లక్ష్మయ్య, వీరాంజనేయరెడ్డి, హోంగార్డులు బసిరెడ్డి, కళ్యాణ్‌లను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు. ఈ స మావేశంలో కడప రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, కడప తాలూకా సీఐ ఉలసయ్య, పెండ్లిమర్రి ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పేట్రేగిన పిచ్చికుక్కలు

అన్నమయ్య జిల్లా రాజంపేట, చిట్వేలిలో పిచ్చికుక్కలు పేట్రేగాయి. వీటి దాడిలో రాజంపేటలో ఇద్దరు, చిట్వేలిలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు.

ముగ్గురికి తీవ్రగాయాలు




గాయపడిన లక్ష్మీ నరసమ్మ, చౌడయ్య

రాజంపేట రూరల్ : రాజంపేటలో పిచ్చికుక్క దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక రాజు హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న చౌడయ్య వైఎస్సార్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈయన టీ తాగేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చారు. వీధిలో ఉన్న పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తోపుడుబండిలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగించే నరసయ్య అనే వ్యక్తిపై కూడా కుక్కలు దాడిచేసి గాయపరిచాయి.

చిట్వేలిలో మహిళపై..

చిట్వేలి : మండల పరిధిలోని నేతివారిపల్లిలో బుధవారం లక్ష్మీ నరసమ్మ (65) అనే మహిళపై పిచ్చి కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చిట్వేలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఇప్పటి వరకు 20 మందిపై కుక్కలు దాడి చేసినట్లు సమాచారం. అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుండి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఇద్దరికి రిమాండు

ప్రొద్దుటూరు క్రైం : చెక్ బౌన్స్ కేసులో ఇరువురికి కోర్టు రిమాండు విధించింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు తాటినరసింహులు, ఎం శంకర్‌లు ప్రొద్దుటూరులోని శ్రీరాం ఆటోఫైనాన్స్‌లో వాహనాల కోసం రుణం తీసుకున్నారు. నరసింహులు రూ. 3.60 లక్షలు, శంకర్ రూ. 2.50 లక్షలు రుణం తీసుకొని అందుకు సంబంధించి చెక్కులను ఫైనాన్స్ కంపెనీకి ఇచ్చారు. అయితే వారు ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో కంపెనీ ప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు కోర్టు వారికి అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు టూ టౌన్ పోలీసులు బుధవారం ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండుకు పంపించారు.

విభిన్న ప్రతిభావంతులకు వివిధ కోర్సుల్లో శిక్షణ

కడప సిటీ : ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో పులివెందులలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు ఆర్వీ కృష్ణకిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన శారీరక విభిన్న ప్రతిభావంతులు మూగ, చెవిటి, విభిన్నప్రతిభావంతులకు మొబైల్ ఫోన్ రిపేరు, ఎల్ఈడీ బల్బుల రిపేరు కోర్సులో మూడు నెలల కాల పరిమితితో ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. పులివెందులలోని శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల విభిన్న ప్రతిభావంతులు తమ బయోడేటాకు పదోఎతరగతి పాసైన పత్రం, వైద్య ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు వికలత్వం తెలియజేసే పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు జతచేసి సహాయ సంచాలకులు, ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ (కొత్త కలెక్టరేట్ డి-బ్లాక్, కడప నందు)లో ఈనెల 31వ తేదీలోగా సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 08562-295480 నంబరులో సంప్రదించాలన్నారు.

ఒకరిని రక్షించబోయి.. మరొకరు..

– ప్రమాదవశాత్తు కాలువలో పడి తల్లీకుమార్తెలు మృతి




శ్యామల (ఫైల్) రమణమ్మ (ఫైల్)

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం గురిజాల గ్రామ సమీపంలో గల పీబీసీ కాలువలో ప్రమాదవశాత్తు పడి తల్లీకుమార్తెలు రమణమ్మ (52), శ్యామల(28)లు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురిజాలకు చెందిన రమణమ్మ, శ్యామల ఇద్దరూ తమ తోట వద్ద ఉన్న పీబీసీ కాలువలో దుస్తులు ఉతకడానికి వెళ్లారు. కాలువలో నీరు సుడులు తిరుగుతున్నాయి. ప్రమాదవశాత్తు శ్యామల నీటి సుడిలో పడిపోయింది. కుమార్తెను రక్షించేందుకు రమణమ్మ నీటిలో దూకింది. అయితే సుడిలో చిక్కుకుని ఇద్దరూ మృతి చెందారు. మృతురాలు శ్యామల సింహాద్రిపురం సచివాలయం -1 పరిధిలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తోంది. రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐలు సునీల్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను వెలికితీయించి పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చేపలు పట్టేందుకు వచ్చి మృత్యుఒడికి



షేక్ వలీ మృతదేహం

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని గుండ్లకమ్మ వంకలో బుధవారం సాయంత్రం చేపలు పట్టేందుకు ఇద్దరు యువకులు వచ్చారు. వంకపై రోడ్డుకు ఇరువైపులా చేపలు పడుతుండగా.. షేక్ వలీ(32) అనే యువకుడు ప్రమాదవశాత్తు వంకలో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు ప్రొద్దుటూరు పరిధిలోని రామేశ్వరానికి చెందిన షేక్ వలీ గత కొన్నేళ్లుగా కొనేటి కాలువ వీధిలో పప్పుల బజార్లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు తాజుద్దీన్‌తో కలసి చాపాడు సమీపంలోని నక్కలదిన్నె రోడ్డులో గల గుండ్లకమ్మ వంక దగ్గరికి చేపలు పట్టేందుకు వచ్చారు. వంకపై దారికి ఇరువైపులా ఇద్దరు చేపలు పడుతుండగా సాయంత్రం 4గంటల ప్రాంతంలో స్నానం చేస్తానని వంకలోకి దిగిన వలీ ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని ఇండియన్ పెట్రోలు బంకు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతిచెందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు మున్సిపాలిటీ పరిధిలోని ఐలమ్మకాలనీకి చెందిన చప్పిడివరదయ్య, బాలగురమ్మలకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె అయిన అమిలిపోగులక్ష్మీదేవి (27) ఐదేళ్ల క్రితం అదే కాలనీకి చెందిన బాబును ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా లక్ష్మీదేవి వస్త్ర దుకాణంలో పనిచేస్తూ ఉంటుంది. బుధవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా నెల్లూరు రోడ్డులోని ఇండియన్ పెట్రోలు బంకు సమీపంలో లారీ ఢీకొనడంతో లక్ష్మీదేవి తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు.